# స్నేహితుడు

**కట్టా రాంబాబు**

బస్ కోసం నిలబడి నిలబడి విసుగొచ్చేసింది.

ఈ బస్సుల్ని నమ్ముకుని ప్రయాణాలు పెట్టుకుంటే యింతే. పేపరుచూసుకుంటూ నిలబడ్డాను.

"ఒరేయ్! విశ్వం" ఎవరో ఎవర్నో పిలిచారు.

"నిన్నేరా పిలుస్తుంటే పలకవేం?" అంటూ ఒకతను వచ్చి నా బుజంమీద చరిచాడు.

"నన్నా మీరు పిలి చింది. నాపేరు విశ్వంకాదు, 'సూర్యం" అన్నాను.

"అదే....సూర్యం అలా పిలవబోయి విశ్వం అన్నాను" అన్నాడతను.

అతనెవరో నాకు తెలీదు. మనిషిని పరికించి చూసాను. నా వయస్సే వుంటుం దతనికి. సాదా బట్టల్లో వున్నాడు. ఒరే అని పిలుస్తున్నాడంటే నన్ను చూసి పొరపాటుపడివుంటాడు.

"మీరు నన్నుచూసి ఎవరనుకుంటున్నారో నేను...."అంటూ చెప్పబోయాను.

"అరే! నన్ను అప్పుడే మరిచిపోయావేంట్రా. నేను బ్రహ్మన్ని గుర్తుపట్టలేదా?"

"బ్రహ్మం అంటే...."

"అదేరా నీ చిన్నప్పటి క్లాసమేటుని స్నేహితుణ్ణి."

బ్రహ్మం అనే పేరుగలవాళ్ళెవ్వరూ నాకు ఒకటో తరగతి నుంచి ఎమ్మే క్లాస్‌మేట్సుగా లేరు. అవిషయం నాకు బాగా గుర్తు. మరయితే యితనెవరు?

అతను ఏదేదో చెప్పుకొస్తున్నాడు. తనెప్పుడూ క్లాసులో ఎలా అల్లరిచేసేవాడో, మేష్టర్ని ఎలా ఏడిపించేవాడో, తనంటే ఆడపిల్లలు ఎలా భయపడేవారో ఉదాహరణలతో సహా చెపుతున్నాడు. ఇలాంటివాళ్ళు ప్రతి క్లాసులోను వుండేవారు. కానీ వాళ్ళలో బ్రహ్మం అని పేరుగలవాళ్ళెవరూ లేరు.

ఒకవేళ నేనే పొరపడుపడుతున్నా నా? నిజంగా అతను నాతో చదివివుండకపోతే అంత క్లోజ్‌గా ఎలామాట్లాడతాడు?

"అవునూ! టెంత్‌లో మన క్లాస్‌మేటు సుబ్బలక్ష్మి వుండేది గుర్తుందా? మెల్లకన్నూ, పిలకజడలూ






వుండేది. ఎలా 'మరిచిపోతావులే....అప్పుడు మనం బాగా ఏడిపించేవాళ్ళం. వాళ్ళమ్మాయికి పురుడు పోయించడానికి హాస్పిటల్‌కి తీసుకొచ్చింది. నేనూ కాస్త వంట్లో బాగుండకపోతే హాస్పిటల్‌కి వెళ్లాన్లే. ముసలమ్మలా అయిపోయింది. మనమింకా కుర్రాళ్ళలాగా వున్నాము. నేనే గుర్తుపట్టి పలకరించాను. నీగురించి కూడా అడిగింది" అంటూ ఆపాడు.

ఎంత తలబద్దలు కొట్టుకున్నా ఆ సుబ్బలక్ష్మి, ఈ బ్రహ్మం ఎవరో గుర్తు రావడంలేదు. నువ్వెవ్రో తెలీదు, పొమ్మందామంటే సభ్యతగా వుండదేమో. చుట్టూ చాలామంది కూడా ఉన్నారు. సర్లే ఎవరయితే ఏంలే బస్సు వస్తే పోవచ్చును కదా అని అతనేం చెపుతున్నా వింటున్నాను.

ఇంతలో బస్సు రానే వచ్చింది. బస్సెక్కాను. అతను కూడా నాతోపాటే ఎక్కి నా ప్రక్కనే కూర్చున్నాడు.

'యిదెక్కడి జిద్మురా బాబూ ఈ బోరు బస్ దిగే వరకూ తప్పదన్నమాట' కండక్టరు వచ్చాడు టికెట్స్ తీసుకోమంటూ.

నేను అయిదు రూపాయల నోటు తీసి నా టికెట్ తీసుకోబోయాను.

"అదేంట్రా చాలా కాలానికి కలిశాం. నువ్వు తియ్యడం ఏమిటి నేను తీస్తానుండు" అంటూ అతనొక అయిదు రూపాయల నోటు తీసి యివ్వబోయాడు.

నేనతన్ని వారించి నేను తీస్తానన్నాను. వీల్లేదంటూ అతను నా చేతిని పట్టుకున్నాడు.

"ఎవరో యివ్వండిసార్" అన్నాడు కండక్టరు.

నేను నా చేతిని విడిపించుకుని నోటుని కండక్టరు చేతిలో పెట్టబోయేసరికి అతను ముందే కండక్టరుకు నోటుని చూపించి అతని కేష్‌బ్యాగ్‌లో పెట్టేసి "అమలాపురం • రెండు టికెట్లియ్యి" అన్నాడు.

## స్నేహితుడు

కండక్టరు నవ్వుతూ టికెట్లు పంచ్‌చేసి వాటితోపాటు ఒకరూపాయి అతని చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు.

ఇంతకీ యితనెవరో అంతుబట్టడంలేదు. నేనెవరో తెలియకుండా నాకు టికెట్ ఎందుకు తీస్తాడు. ఎప్పుడో నాకు క్లాస్‌మేటు అయ్యేవుంటాడు. నేనే పొరపాటుపడ్డానేమో. నా మతిమరుపుకు తిట్టుకున్నాను.

అరగంటలో అమలాపురం చేరుకున్నాము.

ఇద్దరం బస్ దిగాం. మమ్మల్ని దించి బస్ ముందుకు వెళ్ళిపోయింది.

"సార్! నా ప్రవర్తన మిమ్మల్ని చాలా ఆశ్చర్యపరిచింది కదూ" అన్నాడు. అతనివంక ఆశ్చర్యంగా చూసాను.

"అంత చనువుగా ప్రవర్తించినందుకు క్షమించండిసార్. నిజంగా మీరెవరో నాకు తెలీదు. నేను మీతో చదవలేదు. మీరు నా స్నేహితులు కారు. అయితే స్నేహితుడనేవాడు ఆపదలో ఆదుకుంటాడట. మీరు నిజంగా నాకు స్నేహితులుకాకపోయినా నన్నాదుకున్నారు"

'నేనా!!!"

"అవున్సార్. నేను మధ్యాహ్నం హోటల్లో భోజనంచేసి నాదగ్గరున్న పదిరూపాయలనోటుని హోటలువాడికిస్తే వాడు మారని అయిదురూపాయల నోటుని నాకు అంటగట్టాడు. నేనప్పుడు చూసుకోలేదు. తర్వాత చూసుకుని వెళ్ళి అడిగితే దాన్ని తనివ్వలేదు పొమ్మన్నాడు. యింతకుముందొక బస్ ఎక్కాను. కండక్టరు అది మారదు యింకోనోటివ్వమన్నాడు. నాదగ్గరింక డబ్బుల్లేక బస్ దిగిపోయాను. తర్వాత మీరు దేవుళ్లా కనపడ్డారు. మీ స్నేహితుడిలా నటించి కండక్టరు బ్యాగ్‌లో ఆ నోటుని పెట్టేసాను. మనిద్దరం నిజంగా స్నేహితులమని, టికెట్స్ తియడానికి పోట్లాడుకుంటున్నామనుకుని ఆ నోటిలాంటిదో చూడకుండానే టిక్కెట్లిచ్చేసాడు."

నే నతనివంక ఆశ్చర్యంగా నోరావలించి చూస్తున్నాను.

"నేనతన్ని మోసంచేశానని బాధపడటంలేదుసార్. ఎందుకంటే హోటలువాడు నాకంటగట్టినట్లే ఈ కండక్టరు కూడా ఎవరికో అంటగట్టేస్తాడు. అదలా చేతులు మారుతూనేవుంటుంది."

అతని తెలివితేటలకు నాకు మతిపోయింది.

"సార్! మళ్ళీ నేనువెనక్కి పోవాలంటే నాదగ్గర ఒక రూపాయేవుంది. మీ టిక్కెట్ డబ్బులు రెండు రూపాయలు యిస్తే నేను పని చూసుకుని తిరిగిపోగలను" అన్నాడతను. అలా అడిగినందుకు సిగ్గుపడుతున్నట్టు తల వంచుకున్నాడు.

నేను రెండు రూపాయలు తీసి అతనికిచ్చాను.

"నమస్కారం సార్" అని చెప్పి వెళ్ళిపోతున్న అతనివంక చూస్తూ వుండిపోయాను. □

### మనుగడ

ఆశ అమృతమై
మనిషిని బ్రతికించి,
ముందుకు నడిపిస్తుంది.
దురాశ గరళమై
మనిషి అంతు చూసేదాకా,
వదిలిపెట్టదు.
ఆశ దురాశల మధ్య
భేదం గ్రహిస్తేనే
మనిషి మనుగడ భద్రం.

— సూర్యదేవర జోగేశ్వరరావు